క్లుప్తంగా

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది



హెచ్‌ఎం యానాదిశెట్టిని సన్మానిస్తున్న ఎంపీడీవో, ఎంఈవోలు

దక్కిలి : ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని ఎంపీడీవో గుణ శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎగువమారల గుంట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం తోట యానాదిశెట్టి బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనను స్థానిక ఎమ్మార్సీలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు వెంకటేశ్వర్లు, జగదీష్, మోపూరు హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగభూషణం, ఏపీటీఎఫ్ నాయకుడు నాగమోహన్, ఉపాధ్యాయులు దూడల పెంచలయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

పశువైద్యశాల ఏడీ రమణయ్య స్వచ్ఛంద ఉద్యోగ విరమణ



ఏడీ రమణయ్యను సన్మానిస్తున్న అధికారులు

వాకాడు : వాకాడు మండల ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ దర్శి రమణయ్య బుధవారం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా వాకాడు షాదీ మంజిల్‌లో ఏర్పాటు చేసిన సభలో పలువురు ఉన్నతాధికారులు, వైద్యులు, సిబ్బంది రమణయ్యను ఘనంగా సన్మానించారు. జిల్లా అనిమల్ హస్బెండరీ ఆఫీసర్ రవికుమార్ మాట్లాడుతూ రమణయ్య చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా వెటర్నరీ డాక్టర్స్ అసోసియేషన్ నాయకుడు జయప్రకాష్, నాయుడుపేట ఏడీ వేణుగోపాల్, బద్వేల్ ఏడీ నాగభూషణం, మాలకొండయ్య, కోట మండల డాక్టర్ రాజేష్, గున పాటిపాళెం పశువైద్యులు శ్రీహరి, మొలగనూరు పశువైద్యులు కృష్ణారావు పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్ గోడౌన్ తనిఖీ

రాపూరు: రాపూరు సమీపంలోని మద్దెలమడుగు వద్ద ఉన్న సివిల్ సప్లయీస్ గోడౌన్‌ను బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. నిల్వ ఉన్న బియ్యం బస్తాలు, పామోలిన్ ప్యాకెట్లు, రికార్డులను పరిశీలించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ రేషన్ కార్డుదారులకు సకాలంలో బియ్యం అందజేయాలన్నారు. 300 కిలోల బియ్యం, 10 నూనె ప్యాకెట్లు తక్కువగా ఉన్నాయని, దీనిపై జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దార్ కృష్ణప్రసాద్, వెంకటరెడ్డి, డీటీ హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

దొరవారిసత్రం : మండలంలోని కట్టువాపల్లె ఎస్సీ కాలనీలో బుధవారం విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. సుబ్బయ్య పెద్ద కుమారుడు గిరిధర్(18) ఇటీవల ఇంటర్ ఉత్తీర్ణుడయ్యాడు. ఈ క్రమంలో బయట చెడు సావాసాలు చేయవద్దని మంగళవారం రాత్రి తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన బాలుడు కృష్ణాపురం కాలనీ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జీఆర్‌పీ ఎస్‌ఐ చెన్నకేశవ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నదిలో మునిగి బాలుడి మృతి

తాడేపల్లి రూరల్: వెంకటగిరికి చెందిన బాలుడు గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణం పిరమిడ్ ధ్యాన కేంద్రానికి వచ్చి ప్రమాదవశాత్తూ కృష్ణా నదిలో మునిగి మృతిచెందాడు. ఎస్‌ఐ ప్రతాప్ కుమార్ కథనం మేరకు బాలుడు మురారి(14) తన మేనత్త సుభాషిణితో కలిసి బుధవారం పిరమిడ్ ధ్యాన మందిరానికి వచ్చాడు. సాయంత్రం తోటి వారితో కలిసి కనకదుర్గవారధి సమీపంలో నది వద్ద నీటిలో దిగి ఆడుతూ గల్లంతయ్యాడు. స్థానికులు వెతకగా మృతదేహం లభించింది. కేసు దర్యాప్తులో ఉంది.


బైక్ బోల్తాపడి వ్యక్తికి తీవ్ర గాయాలు

రాపూరు: పెంచలకోన జాతీయ రహదారిలో బుధవారం బైక్ బోల్తా పడడంతో వ్యక్తి గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. డక్కిలి మండలం డి.వడ్డిపల్లికి చెందిన ప్రసాద్ పెంచలకోన నుంచి రాపూరు వైపు వెళుతున్నాడు. సైదాదుపల్లి సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. తీవ్రంగా గాయపడిన ప్రసాద్‌ను హైవే అంబులెన్స్ సిబ్బంది రాపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం 108లో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు.

తుప్పుపడుతున్న బ్యారేజ్ గేట్లు

వేలాది మంది రైతన్నల జీవన జ్యోతి వాకాడు స్వర్ణముఖి బ్యారేజ్ ఆలనా పాలనా కరువై అస్తవ్యస్తంగా మారింది. గేట్లు, మోటార్లు తుప్పుపడుతున్నాయి. బ్యారేజ్ గేట్లను ఆపరేటింగ్ చేసేందుకు అవసరమైన లస్కర్లు లేవు. రోప్‌లు తుప్పుపట్టి తెగిపోయాయి. భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారింది. పరికరాలు, పైలాన్‌కు సంబంధించిన గ్రానైట్ పలకలు, లోహపు వస్తువులు చోరీకి గురవుతున్నాయి. లైట్లు లేకపోవడంతో వంతెనపై ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బ్యారేజ్ నిర్వహణపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

- మరమ్మతులకు గురవుతున్న మోటార్లు
- నిరుపయోగంగా పార్కు, వాటర్ ఫౌంటేన్
- పట్టించుకోని అధికారులు, పాలకులు



తుప్పుపడుతున్న బ్యారేజ్ మిషనరీల పైభాగం

బ్యారేజ్ కింద ఆయకట్టు వివరాలు
బ్యారేజ్ కింద చెరువులు 11
ఆయకట్టు భూములు 20 వేల ఎకరాలు
రైతులు 3024 మంది
బోరు బావులు 1625
బ్యారేజ్ గేట్లు 34
మరమ్మతులకు గురైన గేట్లు 6

వాకాడు : దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా వాకాడు సమీపంలోని స్వర్ణముఖి నదిపై 2008 బ్యారేజ్‌ని నిర్మించారు. ఈ బ్యారేజ్‌కు 34 గేట్లు ఉన్నాయి. ప్రతి గేట్‌కు ఒక మోటార్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా 11 చెరువులకు సాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు. దీని కింద దాదాపు 20 వేల ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. 3024 మంది రైతులు లబ్ధిపొందుతున్నారు. అలాగే సుమారు 1625 బోరు బావులు దీని ఆధారంగా పనిచేస్తున్నాయి. వైఎస్సార్ మరణించిన తర్వాత వచ్చిన పాలకులు బ్యారేజ్ నిర్వహణ గురించి పట్టించుకోవడం మానేశారు. గేట్లు, మోటార్ల నిర్వాహణ కోసం వాచ్‌మెన్, లస్కర్లు, ఎలక్ట్రీషన్లను నియమించలేదు. దీంతో బ్యారేజ్ భద్రత ప్రశ్నార్థకంగా తయారైంది. పరికరాలు, పైలాన్‌కు సంబంధించిన గ్రానైట్ పలకలు, లోహపు వస్తువులు చోరీకి గురవుతున్నాయి. బ్యారేజ్‌పై విద్యుత్ దీపాలు వెలగక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నారు. బ్యారేజ్ మోటార్లు తుప్పుపట్టి మరమ్మతులకు గురవుతున్నాయి. బ్యారేజ్ గేట్లను ఆపరేటింగ్ చేసేందుకు లస్కర్లు లేవు. రోప్‌లు తుప్పుపట్టి తెగిపోయాయి.

అధ్వానంగా పార్క్, వాటర్ ఫౌంటేన్

స్వర్ణముఖి నది ఒడ్డున రూ.75 లక్షలతో అతిథి గృహం, ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం, దాని ఆవరణలోనే రూ.35 లక్షలతో సందర్శకుల సౌకర్యార్థం పార్క్, వాటర్ ఫౌంటేన్‌ను ఏర్పాటు చేశారు. వీటి చుట్టూ ప్రహరీ లేకపోవడంతో మందు బాబులకు నిలయంగా మారింది. పార్క్‌లో పిచ్చి మొక్కలు మొలిచి రూపు రేఖలు మారిపోయింది. అతిథి గృహంలో అన్ని గదులకు ఏసీ సౌకర్యంతోపాటు, ప్రత్యేకంగా డైనింగ్ హాల్, సమావేశ మందిరం, రిఫ్రిజిరేటర్, విలువైన ఫర్నిచర్ ఏర్పాటుచేశారు. నిర్వాహణ గురించి పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బ్యారేజ్ నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



బ్యారేజ్‌లో వున్న నీరు

బ్యారేజ్ నిర్వాహణను పట్టించుకోండి



ఆ మహానుభావుడు వైఎస్ఆర్ నిర్మించిన బ్యారేజ్ నిర్వాహణ పట్ల అధికారులు చొరవ చూపాలి. ఈ బ్యారేజ్ ఆధారంగా ఎంతో మంది పేద రైతులు పంటలు పండించుకుంటున్నారు. బ్యారేజ్‌కి కమిటీని నియమించి తెలుగు గంగ నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– కుక్కముళ్ల పెంచలయ్య, రైతు నెల్లిపూడి

తుప్పు పడుతున్నా పట్టించుకోరా..?



బ్యారేజ్ గేట్లు, మోటార్లు తుప్పుపట్టి పాడవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. బ్యారేజ్‌పై దీపాలు వెలగడం లేదు. దీంతో తరచూ ప్రమాధాలు జరుగుతున్నాయి. బ్యారేజ్ అతిథి గృహం ఆలనా, పాలనా చూసే వారు కరువయ్యారు. రూ.లక్షల ప్రజాధనం వృథా అవుతోంది.

– చేను వెంకటయ్య, రైతు, వాకాడు

నృసింహుడికి చందనాలంకరణ

చిల్లకూరు : మండలంలోని కలవకొండలో వెలసిన ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అక్షయ తృతీయ సందర్భంగా స్వామి వారికి చందన అంకారం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఉభయకర్తలుగా బండ్ల సుమంత్‌కుమార్, సంధ్యారాణి వ్యవహరించారు.

కక్ష కట్టి నోటీసులు ఇచ్చారు

దక్కిలి: తాను 20 ఏళ్లుగా డక్కిలి సర్వే నంబరు 258–1లో పోరంబోకు భూమిని సాగు చేసుకుంటున్నానని, దానికి పట్టా ఇవ్వకపోగా తహసీల్దార్ శ్రీనివాసులు నోటీసులు జారీ చేయడం తగదని డి.మురళీరెడ్డి అనే రైతు వాపోయాడు. ఆయన బుధవారం డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అదే సర్వే నంబరులో డక్కిలికి చెందిన బెదరకంటి రమేష్, డక్కిలి చంద్రశేఖర్‌రెడ్డి, దందోలు వెంకటరమణారెడ్డి, డక్కిలి శంకర్‌రెడ్డి, దందోలు సుబ్బమ్మ, దందోలు శ్రీనివాసులురెడ్డి తదితరులు భూములు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. వారందరికీ విద్యుత్ సర్వీసులు ఉన్నాయని, ఎవరికీ నోటీసులు ఇవ్వలేదని, తనపై కక్షకట్టి నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. 20 ఏళ్ల నుంచి తన సర్వీసుకు సంబంధించి ఎటువంటి విద్యుత్ బకాయిలు లేవని తెలిపారు. అధికారులు విచారించి తనకు న్యాయం చేయాలని కోరారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

గూడూరు రూరల్ : ఉపాధి హామీ కింద ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆదేశించారు. ఆయన బుధవారం గూడూరు ఎంపీడీవో కార్యాలయంలో డివిజన్‌లోని అన్ని మండలాల ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ కూలీలకు కనీస వేతనం రూ.300 వచ్చేలా క్షేత్ర సహాయకులు పని కల్పించాలన్నారు. ప్రతి పనీ పారదర్శకంగా ఉండాలని, అందుకు ఉపాధి ఏపీవో కూడా బాధ్యత వహించాలని పేర్కొన్నారు. పనిప్రాంతంలో షెల్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. నీటి గుంతలు, పశువులకు నీటి తొట్టెలు నిర్మించాలని సూచించారు. సమావేశంలో ఏపీడీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ పరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

చిల్లకూరు : చిల్లకూరు, కోట మండల తీర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న క్రిస్ సిటీ కోసం భూములు కోల్పోయిన వారందరికీ పరిహారం ఇవ్వాలని, లేకుంటే ఆందోళనలు చేస్తామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హెచ్చరించారు. ఆయన బుధవారం ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు గూడూరు వచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. చిల్లకూరు, కోట మండలాల్లో సేకరించిన భూముల్లో 214 ఎకరాలకు పరిహారం ఇవ్వకుండా అధికారులు సాకులు చెప్పడం భావ్యం కాదన్నారు. వేరుశనగ పంటను దున్నేయడం దారుణమన్నారు. తెలంగాణాలో త్వరలో అందాల పోటీలు నిర్వహించేందుకు సిద్ధం అవుతున్నారని దీనిని ప్రతి ఒక్కరు ఖండించాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళీ, కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, పెంచలయ్య, శశికుమార్, రమేష్, నారాయణ, శీను, సందాని, డానియేల్ పాల్గొన్నారు.

టీచర్ చిరంజీవులు సేవలు అనిర్వచనీయం



టీచర్ చిరంజీవులు, మాధవి దంపతులను సత్కరిస్తున్న ఎంఈవోలు, అధికారులు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి మండలం చిన్నన్నపేట ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు చిరంజీవులు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు రాణిపేట ఎంపీపీ పాఠశాలలో సన్మానం చేశారు. ఎంఈవోలు టి.వెంకటేశ్వర్లు, సి.బాబయ్య మాట్లాడుతూ చిరంజీవులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేశారని తెలిపారు. ఆయన సేవలు అనిర్వచనీయమని కొనియాడారు. కార్యక్రమంలో పవన్ కళ్యాణ్, సంగీత, యువశ్రీ, సాయిబాబా, బీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధి బాబు

చిల్లకూరు : మండలంలోని తొణుకుమాల గ్రామానికి చెందిన ఎస్కే అమీర్ మూడు రోజుల క్రితం ముత్తుకూరులో రోడ్డు ప్రమాదానికి గురై నెల్లూరులోని ఒక ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యం కోసం ఆర్థిక స్థోమత లేకపోవడంతో కుటుంబ సభ్యులు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులను కలిసి సాయం అర్థించారు. స్పందించిన ట్రస్టు అధినేత రాజనేని శ్రీనివాసులు రూ.20 వేలు సాయం చేశారు. ఈ నగదును బుధవారం ట్రస్టు ప్రతినిధి బాబు ఆస్పత్రిలోని కుటుంబ సభ్యులకు అందజేశారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మేనేజర్ శ్రీనివాసులుకు బాధ్యతలు అప్పగించారు. చిన్నయ్య చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ ఆన్ డ్యూటీపై గత ఏడాది జూన్ నుంచి ఇక్కడికి వచ్చారు. ఏమైందో మేనేజర్ శ్రీనివాసులుకి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించి రిపోర్టు చేసుకోవాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి.

పనుల్లో పురోభివృద్ధి ఉండాలి



క్రిస్‌సిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న జేసీ

చిల్లకూరు/కోట: క్రిస్ సిటీ పనుల్లో పురోభివృద్ధి చూపించాలని జేసీ శుభంబన్సల్ ఆదేశించారు. ఆయన బుధవారం చిల్లకూరు మండలం తీగపాళెం, కోట మండలం కొత్తపట్నంలో జరుగుతున్న క్రిస్ సిటీ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అనుమతులు ఇచ్చినప్పటికీ పనులు పూర్తి చేయలేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వారానికి ఒక రోజు పనులపై సమీక్షిస్తామన్నారు. గ్రామంలో రోడ్డు కోసం ఇళ్లు తొలగించనున్న 8 మందికి స్థలం చూపడంతో పాటు పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. చిల్లకూరు, కోట తహసీల్దార్లు శ్రీనివాసులు, జయజయరావు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట మండలం కోటపోలూరు గ్రామంలో పేకాట స్థావరాలపై బుధవారం పోలీసులు దాడులు చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేసినట్టు ఎస్‌ఐ బ్రహ్మనాయుడు తెలిపారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.9,110 నగదు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన

దొరవారిసత్రం: ఏకొల్లు చెత్త సంపద తయారీ కేంద్రం, కుప్పారెడ్డిపాళెంలో చెత్త సేకరణను బుధవారం డీపీవో సుశీలాదేవి తనిఖీ చేశారు. గ్రీన్ అంబాసిడర్లతో మాట్లాడి చెత్త సేకరణపై ఆరా తీశా రు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రానికి తరలించాలన్నారు. డీఎల్‌పీవో రవీంద్రబాబు, ఎంపీడీవో గోవర్ధన, పంచాయతీ కార్యదర్శులు రామయ్య, మునికృష్ణ పాల్గొన్నారు.

లైట్లు ఆర్పివేసి ముస్లింల నిరసన

నాయుడుపేట టౌన్ : వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా బుధవారం రాత్రి నాయుడుపేటలోని ముస్లింలతోపాటు అన్ని మసీదుల వద్ద మౌలానాలు, ముతవల్లీలు, మత పెద్దలు లైట్లు ఆర్పివేసి నిరసన వ్యక్తం చేశారు. ముస్లింలకు క్రిస్టియన్ మైనారిటీ నాయకులు సంఘీభావం తెలిపారు.

హక్కులపై అవగాహన అవసరం

చిట్టమూరు : రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ కాయల సతీష్ కుమార్ తెలిపారు. మండలంలోని జలపెద్దిపాళెంలో బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ పిల్లలతో పనులు చేయించకూడదన్నారు. వరకట్నం తీసుకోవడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేయరాదని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఎస్‌ఐ చిన్నబలరామయ్య, ఏపీఎం గున్నయ్య, డీటీ నిరంజన్ పాల్గొన్నారు.

రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే విజయశ్రీ, చైర్ పర్సన్ దీపిక

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీల్లో రూ.4 కోట్లతో మురుగు కాలువలు, సిమెంట్ రోడ్లతోపాటు పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆమె బుధవారం నాయుడుపేట మున్సిపల్ చైర్ పర్సన్ కటక దీపిక, అధికారులు, నాయకులతో కలిసి ఎస్‌ఎస్ ఆర్ కాలనీ, సప్తగిరి చెరువు కట్ట కాలనీ, ఎల్‌ఏ సాగరం పాత బీడీ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీల అభివృద్ధికి మంత్రి నారాయణ చొరవ తీసుకుని నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వైస్ చైర్మన్ షేక్ రఫీ, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, కౌన్సిలర్ రాయపు సరిత, నెలవల రాజేష్, పసల గంగాప్రసాద్, నక్కినబోయిన నాగరాజు, సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

నివాళి



శ్రీనివాసులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: అక్కగారిపేటకు చెందిన బి.శ్రీనివాసులు మంగళవారం తిరుపతి మంగళంలో భవన నిర్మాణ పనులు చేస్తూ కింద పడి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా బుధవారం గ్రామానికి చేరుకున్నారు. శ్రీనివాసులు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుధాకరయ్య, వెంకటేశ్వర్లు, తిరుపాలు, గురవయ్య పాల్గొన్నారు.

ఉగ్రదాడి బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



మధుసూదన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు

చిల్లకూరు : కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. ఆయన బుధవారం మాజీ ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి నెల్లూరు జిల్లా కావలి ప్రాంతానికి చెందిన మధుసూదన్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదులను పాకిస్తాన్ పెంచి పోషిస్తోందని ఆరోపించారు. దేశంలో అలజడులు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మధుసూదన్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఆనం విజయకుమార్‌రెడ్డి, ఎండీ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి సన్మానం



కోట కోర్టు జడ్జిని సన్మానిస్తున్న న్యాయవాదులు

కోట: కోట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ భరత్‌కమల్ బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయనను బుధవారం బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఘనంగా సన్మానించారు.

దొరవారిసత్రంలో..



ఎంఈవో మునిఖర్‌ను సన్మానిస్తున్న టీచర్లు

దొరవారిసత్రం : దొరవారిసత్రం ఎంఈవో శెట్టిపల్లి మునిశేఖర్ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు శేషయ్య, రామయ్య, కిరణ్, వినయ్, హుస్సేన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సాగరమాల రోడ్డు పనుల అడ్డగింత



సాగరమాల రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బాధిత రైతులు

నాయుడుపేట టౌన్ : పరిహారం సాగరమాల రోడ్డు పనులు చేసుకోవాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. వారు బుధవారం కాపులూరు గ్రామ సమీపంలో రోడ్డుపై టెంట్ వేసుకుని పనులను అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ కాపులూరు గ్రామానికి చెందిన 26 మంది రైతులకు చెందిన 10 ఎకరాల భూములను రోడ్డుకు తీసుకున్నారని, రెండేళ్లవుతున్నా పరిహారం ఇవ్వలేదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో జీవనం కోసం 6 నెలల క్రితం తమ భూముల్లో వరి పంట సాగు చేసుకున్నట్టు తెలిపారు. రెవెన్యూ అధికారులు వచ్చి పరిహారం ఇస్తామని చెప్పి వరి పైరును జేసీబీతో తొక్కించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న తహసీల్దారు రాజేంద్ర అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. 10వ తేదీలోపు పరిహారం అందేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.